# టైమ్‌సెన్స్

మన దగ్గరికి తమ అవసరాలకోసం ప్రతి రోజూ ఎంతోమంది వ్యక్తులు వస్తూ పోతూ ఉంటారు ! అవసరం వాళ్ళది కదా అని మనం తాపీగా మన బంధుమిత్రుల్తో బాతాఖానీ వేస్తూనో, తీరుబడిగా ముస్తాబవుతూనో, వాళ్ళని గంటలతరబడి మన వాకిట్లో పడిగాపులు కాచేలా చేస్తూ ఉంటాం !

అది చాల్లేదని...

ఇంట్లో ఉండీ, ఒంట్లో బాలేదనో... ఇప్పుడు కలవడం కుదర్దనో చెప్పి దర్జాగా గుర్రెట్టి పడుకుంటాం !

అయితే....

మనం కూడా మన అవసరార్థం... ఎవరి దగ్గరికైనా వెళ్ళినపుడు... మనక్కూడా అలాంటి చేదు అనుభవాలే ఎదురై.... అసహనంగా ఫీలవుతూ లోలోపల తిట్టుకుంటామన్న విషయం మనం గ్రహించకపోవడమే విడ్డూరం!

మన గొప్పకోసం, భేషజం కోసం మన దగ్గరికి వచ్చిన వాళ్ళని మన చుట్టూ పదే పదే తిరిగేలా చేస్తూ... వాళ్ళ సహనాన్ని పరీక్షించకుండా, వాళ్ళక్కావలసిన పనేదో వెంటనే చేసి పంపిస్తే... కనీసం ఎదుటి వాళ్ళ సమయాన్ని వృధా పుచ్చలేదన్న సంతృప్తయినా మనకు దక్కుతుంది !

అలా అని...

ఒకరు మన దగ్గరికి రావాలన్నా.. మనం ఒకరి దగ్గరికి వెళ్ళాలన్నా... ముఖ్యంగా.... ఎదుటి వాళ్ళకి వాళ్ళ కాలకృత్యాలు తీర్చుకోవడానికికూడా మనం అవకాశమివ్వకుండా... ఉదయం తొమ్మిదికి ముందో, సాయంత్రం ఆరుగంటల తర్వాతో వెళ్ళి, వాళ్ళ 'ప్రైవసీ'కి భంగం కల్గించడం- పనైంతర్వాత కూడా గంటల తరబడి వాళ్ళతో హస్కవేస్తూ...తద్వారా 'ప్రతీ మనిషికి ప్రతీక్షణం అమూల్యమైన ఈ స్పీడ్ యుగం'లో... ఎదుటి వాళ్ళ టైమ్ వేస్ట్ చేయడం... భావ్యం కాదు !

16-12-1994